



WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

# విజయ కెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY




సెప్టెంబర్ 16 బుధవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 223 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సుద్ అహ్మద్

WEDNESDAY SEPTEMBER 16 2026 | VOL:18 | ISSUE: 223 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed




విద్య, వైద్యం, పర్యాటక రంగాల్లో కలిసి పనిచేద్దాం

సిటీ కాలేజీ, ఉస్మానియా ఆస్పత్రి పునరుద్ధరకు ఆగాఖాన్ ఫౌండేషన్ సహకారం కోరిన సీఎం

మూసీ పునరుజ్జీవంతో హైదరాబాద్‌కు కొత్త రూపం.. నైట్ ఎకానమీ అభివృద్ధికి ప్రణాళికలు

30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ.. ఆసక్తి చూపిన ప్రిన్స్ రహీమ్

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం

ఫ్యూచర్ సిటీలో ఆగాఖాన్ యూనివర్సిటీ ఏర్పాటుపై ప్రతిపాదన

భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 7 నుంచి నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-5ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలోని విద్య, వైద్య, పర్యాటక రంగాల్లో కలిసి పనిచేద్దామని ప్రతిపాదించారు. మంగళవారం తాజ్ ఫలక్‌నుమా ప్యాలట?సలో ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-5తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-5 తండ్రి ఆగాఖాన్-4 మృతి పట్ల సీఎం సంతాపం తెలిపారు. హైదరాబాద్‌తో ఆగాఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆగాఖాన్ ఫౌండేషన్‌పై తమకు అత్యంత గౌరవం ఉందని సీఎం తెలిపారు. తెలంగాణలో ఫౌండేషన్ తరఫున చేపడుతున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు. తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఆగాఖాన్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఫౌండేషన్ సహకారంతో శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించుకుని ఇటీవలే ప్రారంభించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అంతేకాకుండా ఆగాఖాన్ ఫౌండేషన్ సహకారంతో పునరుద్ధరించిన కుతుబ్ షాహీ టూంబ్స్ ప్రారంభోత్సవంలో తాము కలిసిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు.

మూసీ పునరుజ్జీవంపై ప్రత్యేక దృష్టి

మూసీ పునరుజ్జీవంపై ప్రత్యేక దృష్టి సారించామని ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-5కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈసీ, మూసీ నదుల సంగమ ప్రదేశం ఆక్రమణలకు గురికావడంతో పాటు కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. మూసీ నదిని పునరుజ్జీవింపజేసి నైట్ ఎకానమీని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంలోని సిటీ కాలేజ్, ఉస్మానియా ఆస్పత్రి భవనాల పునరుద్ధరణలో ఆగాఖాన్ ఫౌండేషన్ సహకారాన్ని సీఎం కోరారు. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పగా.. దీనిపై ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-5 ఆసక్తి కనబరిచారు. ఫ్యూచర్ సిటీని ఎక్కడ నిర్మిస్తున్నారని ఆయన ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. కాగా, 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటా ప్రస్తుతం 2.5 శాతం ఉందని, దానిని 10శాతానికి పెంచుతామని అన్నారు. ఇందులో భాగంగా డిసెంబరు 7 నుంచి మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్య, పర్యాటక రంగాల్లో సహకారంపై చర్చ

ఇటీవల బ్రిటన్, అమెరికా పర్యటనల్లో వివిధ ప్రపంచ స్థాయి యూనివర్సిటీలతో తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల గురించి సీఎం సలహాదారు రామకృష్ణారావు.. ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్-5కు వివరించారు. హార్వర్డ్ యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినట?సతోపాటు ఇతర యూనివర్సిటీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించడానికి అంగీకరించాయన్నారు. ఫ్యూచర్ సిటీలో ఆగాఖాన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి యోగితా రాణా కోరారు. పర్యాటక రంగంలో ఆగాఖాన్ ఫౌండేషన్ పాత్రను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్ గుర్తు చేశారు. భవిష్యత్తులో మరింత సహకారం అందించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఆగాఖాన్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పరస్పర సున్నితత్వం పాటించాలి: జిన్‌పింగ్‌తో భేటీలో భారత్ ఆందోళనలు ప్రస్తావించిన ప్రధాని మోదీ

బ్రిక్స్ సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ భేటీ

పరస్పర గౌరవం, ప్రయోజనం, సున్నితత్వం అవసరమని మోదీ స్పష్టీకరణ

భారత్ ఆందోళనలను జిన్‌పింగ్ దృష్టికి తీసుకెళ్లిన ప్రధానమంత్రి

శత్రువులుగా కాదు, భాగస్వాములుగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చైనా వెల్లడి

న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు పరస్పరం ఆందోళనలను అర్థం చేసుకుని, సున్నితత్వంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఉద్ఘాటించినట్లు భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ భేటీకి సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియాకు వివరించారు. "పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనం, పరస్పర సున్నితత్వం" అనే మూడు ప్రధాన సూత్రాల ప్రాతిపదికన ద్వైపాక్షిక సంబంధాలు ముందుకు సాగాలని ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడికి స్పష్టం చేశారని ఆయన తెలిపారు. భారత్‌కు ఉన్న కీలక

(మిగతా 2వ పేజీలో..)



## ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు.. కాంగ్రెస్ ఓటమి ఖాయం: కవిత

ఉద్యోగులతో విభేదించిన ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి రాలేదని కవిత వ్యాఖ్య

కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని విమర్శలు

ఉద్యోగులు, ఉపాధ్యాయులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణ

630 మండలాలకు 8 మంది పర్మినెంట్ ఎంఈవోలే ఉన్నారని విమర్శ

పీఆర్సీ, డీఏలపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపణ



ఉద్యోగులు, ఉపాధ్యాయులతో

(మిగతా 2వ పేజీలో..)

## తెలంగాణకు భారీ వర్ష సూచన.. 19 నుంచి మూడు రోజుల వానలు

ములుగు, భద్రాద్రి, ఖమ్మం జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ

అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

రాష్ట్రంలో కొనసాగుతున్న 19 శాతం వర్షపాత లోటు

హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాల అంచనా



రాష్ట్రంలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సెప్టెంబరు 19 నుంచి మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో

(మిగతా 2వ పేజీలో..)

## నా పీఆర్‌ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు: కేటీఆర్

సైఫాబాద్ పోలీస్ స్టేషన్ లో ముసుగులు ధరించిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్న కేటీఆర్

పీఎస్ బయట, లోపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్

రేవంత్ పాలనతో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని మండిపాటు

హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్‌ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్

(మిగతా 2వ పేజీలో..)





విజయకెరటం
తెలుగు దినపత్రిక

## పరస్పర సున్నితత్వం పాటించాలి: జిన్‌పింగ్‌తో భేటీలో భారత్ ఆందోళనలు ప్రస్తావించిన ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ఆందోళనలను కూడా ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించినట్లు జైస్వాల్ పేర్కొన్నారు.మరోవైపు, ఈ సమావేశంపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పందిస్తూ, ఇరు దేశాలు పరస్పరం శత్రువులు కాదని, భాగస్వాములుగా కొనసాగాలనే ఏకాభిప్రాయానికి వచ్చాయని తెలిపారు. ఈ భేటీలో కుదిరిన అత్యంత కీలకమైన అంశం ఇదేనని ఆయన అభివర్ణించారు. సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతలను కాపాడేందుకు ఇరువురు నేతలు అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు.భారత్.. చైనాకు శత్రువు కాదని, ఒక భాగస్వామి అని ప్రధాని మోదీ పేర్కొన్నట్లు చైనా మీడియా కథనాలు వెల్లడించాయి. చైనాతో తమ విధానం ఏ ఇతర దేశం ప్రభావంతోనూ ముడిపడి ఉండదని మోదీ స్పష్టం చేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. కాగా, 2027లో బ్రిక్స్ కూటమికి చైనా అధ్యక్షత వహించనుంది.

## తెలంగాణకు భారీ వర్ష సూచన.. 19 నుంచి మూడు రోజుల వానలు

(మొదటి పేజీ తరువాయి)

భారీ వర్షాలు కురుస్తాయని, ముఖ్యంగా ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసినట్లు ప్రకటించింది.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, సెప్టెంబరు 17 నుంచి 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. ముఖ్యంగా 19, 20 తేదీల్లో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో 64.5 మి.మీ. నుంచి 115.5 మి.మీ. వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఈ సమయంలో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని అధికారులు తెలిపారు.భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్.. జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులతో సమీక్షించి, సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల పరిధిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. మూసీ నదిలోకి నీటిని విడుదల చేయాల్సి వస్తే, లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తుగా హెచ్చరించి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు.ఈ వర్షాలు రాష్ట్రంలో నెలకొన్న వర్షపాత లోటును కొంతమేర తగ్గించవచ్చని భావిస్తున్నారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో సాధారణం కంటే 19 శాతం వర్షపాత లోటు నమోదైంది. సెప్టెంబరు నెలలోనే ఇప్పటివరకు 28 శాతం లోటు ఉంది. ఇక హైదరాబాద్ నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రమే కురుస్తాయని, పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది.

## నా పీఆర్ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## దేశం నుంచి ఆశించడమే కాదు.. సేవ చేయండి: జెన్ జెడ్, జెన్ ఆల్ఫాకు నిర్మల సీతారామన్

### దేశం కోసం ఏం చేయగలరో యువత ఆలోచించాలన్న నిర్మలా సీతారామన్

### యువత నాయకత్వం చేపట్టి దేశానికి తొలి

### తమిళనాడులో గ్లోబల్ కంపెనీలతో ఉపాధి అవకాశాలు పుష్కలమన్న మంత్రి

దేశం నుంచి మనం ఏం ఆశించాలనే దానికంటే, దేశానికి మనం ఏం చేయగలమనే అంశంపైనే యువత ప్రధానంగా దృష్టి సారించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పిలుపునిచ్చారు. యువత ఆకాంక్షలను వినడానికి దేశం సిద్ధంగా ఉందని, అయితే అదే సమయంలో వారు తమ పౌర బాధ్యతలను కూడా చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆమె సూచించారు. మంగళవారం చెన్నైలోని డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ 36వ స్నాతకోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు."యువత నాయకత్వం బాధ్యతలు చేపట్టాలి. దేశ హితానికే ప్రథమ ప్రాధాన్యతనివ్వాలి. దేశం సురక్షితంగా, పటిష్ఠంగా ఉన్నప్పుడే మనకు నివసించడానికి ఒక ప్రశాంతమైన ఆవాసం ఉంటుంది. మన మాతృభూమిని ఎన్నటికీ వదులుకోకూడదు" అని నిర్మల సీతారామన్ పేర్కొన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్యంలో నెలకొన్న అశాంతి వంటి ప్రపంచ పరిణామాలను ప్రస్తావిస్తూ, దేశ భద్రత, స్థిరత్వం యొక్క ఆవశ్యకతను ఆమె ఈ సందర్భంగా నొక్కిచెప్పారు.ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని ఆమె కొనియాడారు. తమిళనాడు రాష్ట్రం పారిశ్రామిక, సాంకేతిక రంగాలలో హబ్‌గా విరాజిల్లుతోందని, ముఖ్యంగా శ్రీపెరంబుదూర్-ఒరగడమ్ కారిడార్ ఆటోమొబైల్, స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల అంతర్జాతీయ కేంద్రంగా నిలుస్తోందని తెలిపారు. కోయంబత్తూరు, మధురై వంటి నగరాల్లోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని ఆమె వివరించారు.ఉద్యోగినులను ప్రోత్సహించేందుకు వీలుగా ప్రతి జిల్లాలో వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేసేందుకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులను కేటాయించినట్లు ఆమె గుర్తుచేశారు. ఈ సందర్భంగా 'తిరుక్కురళ్'లోని సూక్తులను ఉటంకిస్తూ, పట్టభద్రులు అహంకారాన్ని వీడి వినయంతో మెలగాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని ఆమె హితవు పలికారు.



# ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు.. కాంగ్రెస్ ఓటమి ఖాయం: కవిత

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ అధికారంలోకి వచ్చిన దాఖలాలు లేవని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వారిని చిన్నచూపు చూస్తూ నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు.తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగులను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా చూస్తామని కవిత చెప్పారు. ఉద్యోగులను గౌరవించేలా, వారు సంతోషంగా పనిచేసేలా తమ ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు.తెలంగాణ ఉద్యమ సమయంలో ఉపాధ్యాయులు ఉద్యోగం కన్నా ఉద్యమానికే ప్రాధాన్యం ఇచ్చి పోరాడారని కవిత గుర్తు చేశారు. రాష్ట్రంలో 630 మండలాలకు కేవలం ఎనిమిది మంది పర్మినెంట్ మండల విద్యాధికారులు (ఎంఈవోలు) ఉండటం విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత, నాణ్యమైన విద్య అందాలంటే బలమైన యంత్రాంగం అవసరమని అన్నారు.విద్యార్థుల వివరాలు, రిపోర్టుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఒక్క ఉపాధ్యాయుడితో నడుస్తున్న పాఠశాలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు.ఉద్యోగుల సహకారం లేకుండా ప్రభుత్వం ఏ కార్యక్రమాన్నీ సమర్థంగా అమలు చేయలేదని కవిత అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు కూడా ఆశించిన స్థాయిలో లేదని విమర్శించారు. మైకుల ముందు ఎన్ని గొప్పలు చెప్పినా పెన్షన్లు, యూరియా, రైతులకు విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు పీఆర్సీ, డీఏలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు వాటిపై స్పందించలేదని అన్నారు.

# 'నెమ్మదిగా యూపీఐ లావాదేవీలపై ఛార్జీలకు తెరతీశారు'.. మోదీ సర్కార్‌పై రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు

### రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై ఛార్జీకి అవకాశం ఉందని రాహుల్ ఆరోపణ

### రూ.2,000 వరకు యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు ఉండవని కేంద్రం స్పష్టీకరణ

### అంతకుమించిన లావాదేవీల విషయంలో స్పష్టంగా చెప్పని కేంద్రం

### ఎండీఆర్ భారం చివరకు వినియోగదారులపైనే పడొచ్చన్న రాహుల్ గాంధీ

### జీరో-ఎండీఆర్ విధానాన్ని మార్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ఆరోపణ



యూపీఐపై ఛార్జీల విధింపునకు కేంద్ర ప్రభుత్వం తలుపులు తెరిచిందంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. రూ.2,000కు మించిన యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే అవకాశం కల్పించారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీపై కూడా ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు."యూపీఐపై ఛార్జీలు విధించేందుకు మోదీ ప్రభుత్వం నిశ్శబ్దంగా తలుపులు తెరిచింది. రూ.2,000కు మించిన యూపీఐ వ్యాపార లావాదేవీలపై ఇప్పుడు ఎండీఆర్ విధించవచ్చు" అని రాహుల్‌గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఇలాంటి లావాదేవీలు మొత్తం యూపీఐ లావాదేవీల్లో పరిమాణం పరంగా ఐదు శాతం మాత్రమే ఉన్నా.. మొత్తం లావాదేవీల విలువలో దాదాపు 65 శాతం వాటా కలిగి ఉన్నాయని ఆయన తెలిపారు.

రూ.2,000 వరకు మాత్రమే ఛార్జీలు ఉండవా?

బ్యాంకులు, పేమెంట్ వ్యవస్థల సంస్థలు రూ.2,000 వరకు యూపీఐ లావాదేవీలపై, రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై ఛార్జీలు వసూలు చేయకూడదని కేంద్రం ఆదేశించింది. అయితే రూ.2,000కు మించిన లావాదేవీలపై వ్యాపారుల నుంచి ఛార్జీలు తీసుకోవచ్చా లేదా అన్న విషయాన్ని తాజా ఆదేశాల్లో స్పష్టంగా చెప్పలేదు.ఇప్పటివరకు లావాదేవీల మొత్తంతో సంబంధం లేకుండా యూపీఐపై ఎలాంటి ఛార్జీ లేదు. దీంతో కొత్త నిబంధనలపై రాజకీయ చర్చ మొదలైంది.

చివరకు భారం వినియోగదారులపైనేనా?

వ్యాపారులపై ఎండీఆర్ విధించినా ఆ భారాన్ని చివరకు వినియోగదారులే భరించాల్సి వస్తుందని రాహుల్‌గాంధీ అన్నారు. వ్యాపారులు ఆ అదనపు ఖర్చును వస్తువుల ధరల్లో కలిపే అవకాశం ఉందని పేర్కొన్నారు. అమెరికా చెల్లింపు సంస్థలు చాలాకాలంగా భారత్‌లో అమల్లో ఉన్న జీరో-ఎండీఆర్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయని, ఇప్పుడు అదే దిశగా కేంద్రం అడుగులు వేస్తోందని ఆరోపించారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా కేంద్రంపై మండిపడ్డారు. ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కల్పించాల్సిన ప్రభుత్వం.. వారి జేబులపై మరో భారం మోపే మార్గాన్ని వెతుకుతోందని విమర్శించారు.

ఎందుకు ఎండీఆర్?

యూపీఐ లావాదేవీలు భారీగా పెరగడంతో సైబర్ భద్రత, మోసాల నివారణ, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం పెద్ద మొత్తంలో ఖర్చు అవుతోందని కేంద్రం చెబుతోంది. ఈ వ్యవస్థను దీర్ఘకాలంలో స్వయం సమృద్ధిగా కొనసాగించేందుకు ఛార్జీల విధింపు అవసరమని పేర్కొంది.మరిన్ని సంస్థలు ఈ రంగంలోకి వచ్చి పోటీ పెంచాలన్నా స్థిరమైన ఆదాయ నమూనా అవసరమని కేంద్రం తెలిపింది. సబ్సిడీలపైనే ఆధారపడటం ద్వారా యూపీఐ తదుపరి దశ వృద్ధిని కొనసాగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది.ఎండీఆర్ రేట్లను నిర్ణయించే బాధ్యతను ఎన్‌పీసీఐ ఆధ్వర్యంలోని యూపీఐ, సర్వీసెస్ స్టీరింగ్ కమిటీకి అప్పగించే అవకాశం ఉంది. దీంతో భవిష్యత్తులో రూ.2,000కు మించిన యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు వస్తాయా? అన్నదే ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది.

# ట్రంప్ కూడా మా కాంగ్రెస్ హామీలనే కాపీ కొడుతున్నారు: డీకే శివకుమార్

### తమ ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు సక్సెస్ అయ్యాయన్న డీకే శివకుమార్

### కర్ణాటక మోడల్ ను రాజస్థాన్, బీహార్ వంటి రాష్ట్రాలు అనుసరించాయన్న సీఎం

### ఇప్పుడు ట్రంప్ కూడా తమ తరహా హామీలు ఇస్తున్నారని వ్యాఖ్య

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ గ్యారెంటీ పథకాలు అంతర్జాతీయ స్థాయిలో ప్రజాదరణ పొందాయని, చివరికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా తమ పథకాలనే కాపీ కొడుతున్నారని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన ఆయన, తమ ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు బ్లాక్‌బస్టర్ విజయం సాధించాయని అన్నారు.నవంబర్‌లో జరిగే అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల్లో రిపబ్లికన్లు గెలిచి కాంగ్రెస్‌లోని ప్రతినిధుల సభ, సెనెట్‌లపై ఆధిపత్యం సాధిస్తే ప్రతి వయోజన అమెరికన్‌కు 5,000 డాలర్ల చొప్పున 'డివిడెండ్' ఇస్తామని ట్రంప్ ప్రకటించడాన్ని డీకే శివకుమార్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. గతంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్ వంటి రాష్ట్రాలు తమ కర్ణాటక మోడల్‌ను అనుసరించాయని, ఇప్పుడు ప్రపంచంలోనే అగ్రరాజ్యమైన అమెరికా అధ్యక్షుడు కూడా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇదే తరహా సంక్షేమ హామీలను ఇస్తున్నారని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ సిద్ధాంతాలకు, భారత రాజ్యాంగ విలువలకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు అని ఆయన అభివర్ణించారు.



# గణపతి నిమజ్జనానికి నీళ్ల కష్టాలు





## చెరువుల్లో నీరు లేక భక్తుల ఆందోళన

**వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 15:**

వినాయక నవరాత్రులు ముగియడంతో గణనాథుల నిమజ్జనానికి భక్తులు సిద్ధమవుతున్నారు. అయితే వరంగల్ నగరంలోని పలు చెరువుల్లో ఆశించిన స్థాయిలో నీటిమట్టం లేకపోవడంతో వినాయక విగ్రహాల నిమజ్జనం ఎలా చేయాలన్న దానిపై భక్తుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల వర్షాలు కురిసినా కొన్ని చెరువుల్లో నిమజ్జనానికి అనుకూలంగా నీరు లేకపోవడం సమస్యగా మారింది.నగరంలోని ఉర్సు సమీపంలోని పెద్ద చెరువు, మడికొండ చెరువు, కాజీపేట చెరువు, వడ్డేపల్లి చెరువు, దేశాయిపేట చిన్న వడ్డేపల్లి చెరువు, కీర్తినగర్ ప్రాంతంలోని కట్ట మైసమ్మ చెరువు, ఆటోనగర్ డాక్టర్ కాలనీ చెరువు తదితర ప్రాంతాల్లో నీటిమట్టం తక్కువగా ఉండటంతో నిమజ్జన ఏర్పాట్లపై సందిగ్ధత నెలకొంది. దీంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చే వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.ఉమ్మడి వరంగల్‌లో సుమారు 10 వేల వినాయక విగ్రహాలు కొలువుదీరగా, తుదిదశలో సుమారు 6 వేల విగ్రహాల వరకు నిమజ్జనం చేయనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నిమజ్జనానికి ముందే చెరువుల్లో తగినంత నీటిని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ నిమజ్జన ఏర్పాట్లు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.నిమజ్జనానికి భక్తులు ఇబ్బందులు పడకుండా మున్సిపల్ అధికారులు, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని వరంగల్ నగర వినాయక భక్తజనం విజ్ఞప్తి చేస్తోంది. నిమజ్జన ప్రాంతాలను ముందుగానే పరిశీలించి, నీటిమట్టం పెంపు, పారిశుద్ధ్య చర్యలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని కోరుతున్నారు.

# జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ చేపట్టాలి.





**సెప్టెంబర్ 15 విజయ కెరటం ప్రతినిధి**

మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా జిల్లాలో మరోసారి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు "మాదక ద్రవ్యాల నియంత్రణ సమన్వయ జిల్లా స్థాయి కమిటీ" నిర్ణయించింది. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన "మాదక ద్రవ్యాల నియంత్రణ సమన్వయ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలు మాదకద్రవ్యాల బారిన పడకుండా ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా పట్టణస్థాయి నుండి గ్రామ స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాలు, మద్యం, సిగరెట్ల వంటివి ఎక్కువగా వినియోగించే ప్రాంతాలను గుర్తించి కౌన్సిలర్ల ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించాలి.స్వయం సహాయక మహిళా సంఘాలు ప్రతినెల నిర్వహించే గ్రామైక్య సంఘాలలో మాదకద్రవ్యాల విషయాన్ని ఒక అంశంగా తీసుకొని చర్చించి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు అవసరమైన అవగాహన సామాగ్రిని రూపొందించి పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇటీవల కాలంలో నల్గొండ, నకిరేకల్, మిర్యాలగూడ తదితర ప్రాంతాలలో డ్రగ్స్ కేసులు ఎక్కువగా నమోదైనట్లు గుర్తించడం జరిగిందని, ఈ ప్రాంతాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని ,మాదకద్రవ్యాల వినియోగం ద్వారా ప్రాణ నష్టం వంటివి జరగకుండా నిరోధించాల్సిన బాధ్యత అందరి పై ఉందని అన్నారు. యువత, విద్యార్థులను మాదకద్రవ్యాలు ఎక్కువగా ఆకర్షిస్తున్నందున వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం, అలాగే డి అడిక్షన్ సెంటర్లో ఉన్నవారికి కౌన్సిలింగ్ నిర్వహించాలని చెప్పారు. నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన డి అడిక్షన్ సెంటర్ ను వెంటనే ప్రారంభించేందుకు ఏర్పాటు చేయాలని జిల్లా ఆసుపత్రి అధికారులను ఆదేశించారు .అలాగే జిల్లాలోని అన్ని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ వైద్యశాలలు, జిజిహెచ్ తో సహా డ్రగ్ టెస్టింగ్ కిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. మద్యం షాపులలో ప్రత్యేకించి బెల్టు షాపుల్లో మైనర్ల కు మద్యం అమ్మకుండా చర్యలను కట్టుదిట్టం చేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాలలో మితిమీరిన మద్యం, పొగాకు ,గాంజా వంటివి వినియోగించే ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాలలో ఎన్ వై కే కో-ఆర్డినేటర్లు, పంచాయతీ కార్యదర్శుల ద్వారా అవగాహన కల్పించే కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ ను ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులను నిరంతరం గమనిస్తూ ఉండాలని, ఎవరైనా ఆల్కహాల్ లేదా సిగరెట్లు,మత్తు పదార్థాలు, ఇతర చెడు వ్యసనాల వైపు మళ్లుతున్నట్లయితే వారిని గుర్తించి వెంటనే కౌన్సిలింగ్ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రత్యేకించి రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టల్లలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్నదని, ముఖ్యంగా చిన్నవయస్కులు మత్తుమందులకు బానిస అవుతున్నారని, ఈ సంవత్సరం 130 నేర కేసులలో చిన్న వయస్సువారి భాగస్వామ్యం ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిని నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. వీరు అన్ని రకాల కేసులలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగ్యస్వామ్యం కలిగి ఉన్నట్లు ఆయన చెప్పారు. యువత తప్పుడు మార్గంలో వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇందులో భాగంగా అవగాహనతో పాటు, మాదక ద్రవ్యాలు వినియోగించిన వారిని ఆధారాలతో సహా గుర్తించేందుకు అన్ని పిహెచ్ సిలలో డ్రగ్ టెస్టింగ్ కిట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే మత్తు పదార్థాలు ఎక్కువగా వినియోగించేందుకు అవకాశం ఉన్న సంస్థలు, ప్రాంతాలను గుర్తించి ప్రతి జిల్లా అధికారికి రెండు, మూడు సంస్థల్లో అవగాహన కల్పించేందుకు అవకాశం కల్పిస్తే బాగుంటుందని సూచించారు. మద్యం షాపులు,బెల్ట్ షాపుల్లో మైనర్లకు మద్యం అమ్మకుండా చూడాలని,కళాశాలలు, పాఠశాలల్లో కౌన్సిలర్ల ద్వారా కౌన్సిలింగ్ ఇప్పించాలని చెప్పారు.శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్ శ్రీకాంత్ రెడ్డి ,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి,డిఆర్ఓ దశరథ్, డి ఎఫ్ ఓ రాజశేఖర్, సంబంధిత జిల్లా అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## ఇంజనీర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన మంత్రి.

**హైదరాబాద సెప్టెంబర్ 15 విజయ కెరటం ప్రతినిధి**





భారతరత్నమోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి జయంతిని పురస్కరించుకుని జరుపుకుంటున్న జాతీయ ఇంజనీర్స్ డే సందర్భంగా ఇంజనీర్లందరికీ రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డా. బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆర్అండ్‌బీ శాఖ ఈఎన్‌సీ లింగారెడ్డి, చీఫ్ ఇంజనీర్లు బి.వి. రావు, ధర్మారెడ్డి, వసంత్ నాయక్, నర్సింగ్ రావు, వనజతో పాటు పలువురు ఆర్అండ్‌బీ శాఖ ఇంజనీర్లు మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కలిసి జాతీయ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర అత్యంత కీలకమని, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి క్రమశిక్షణ, అంకితభావం, దూరదృష్టి నేటి తరం ఇంజనీర్లకు స్ఫూర్తిదాయకమని అన్నారు.తెలంగాణలో నాణ్యమైన మౌలిక వసతుల నిర్మాణం ద్వారా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ఇంజనీర్లు అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

## అంబులెన్స్‌కు దారి ఏది?

### ఆస్పత్రి మార్గాలపై వ్యాపారుల పెత్తనం.. --అధికారులు ఏం చేస్తున్నారు?

**వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 15 :**



నగరంలోని సీకేఎం ఆస్పత్రి పరిసరాలు, పోస్టాఫీసు నుంచి గుట్టకింద ప్రసూతి ఆస్పత్రికి వెళ్లే మార్గం ఆక్రమణలతో కుచించుకుపోయింది. పూలు, కిరాణా, కోళ్ల మాంసం వ్యాపారులు రహదారినే దుకాణాలుగా మార్చుకుని బల్లలు, స్టాండ్లు, సామగ్రి రోడ్డుపై పెడుతున్నారు. దీంతో వాహనాల రాకపోకలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. అత్యవసర సమయంలో పురిటి నొప్పులతో ఉన్న గర్భిణిని తీసుకెళ్లే అంబులెన్స్‌కు దారి లేకపోతే పరిస్థితి ఏంటి? వ్యాపారుల ఆక్రమణలతో అంబులెన్స్ నిలిచిపోతే ఆ ఆలస్యానికి బాధ్యత ఎవరిది? తల్లి, బిడ్డల ప్రాణాలకు ముప్పు ఏర్పడే పరిస్థితి వచ్చిన తర్వాతే అధికారులు కదులుతారా?

ప్రసవం అనంతరం అత్యవసర చికిత్స కోసం తల్లి, శిశువులను ఎంజీఎం ఆస్పత్రికి తరలించాల్సి వచ్చినా ఇదే సమస్య. ప్రాణాలు కాపాడే అంబులెన్స్‌కు దారి కల్పించలేని స్థితిలో నగర పాలన ఎందుకు?

ఆక్రమణలు కనిపించవా.. లేక పట్టించుకోరా?

రహదారులు ఆక్రమణలకు గురవుతున్నా నగరపాలక సంస్థ అధికారులు నిద్రపోతున్నారా? ట్రాఫిక్ పోలీసులు రోజూ ఈ మార్గంలో తిరుగుతున్నా అడ్డంకులు కనిపించవా? కనిపిస్తే తొలగించకుండా ఎందుకు వదిలేస్తున్నారు? వ్యాపారులపై చర్యలు తీసుకునే ధైర్యం లేదా?రహదారి ప్రజల రాకపోకల కోసం ఉందా.. వ్యాపారుల దుకాణాల విస్తరణ కోసం ఉందా? అంబులెన్స్‌కు దారి ఇవ్వడం కూడా అధికారులకు గుర్తుచేయాలా?

ప్రాణం పోయే వరకు చర్యలు ఉండవా?

నగరపాలక సంస్థ కమిషనర్, ట్రాఫిక్ అధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలి. ఆస్పత్రుల మార్గాల్లోని ఆక్రమణలను తొలగించి, అంబులెన్స్‌లకు ఎలాంటి అడ్డంకి లేకుండా మార్గాన్ని ఖాళీ చేయాలి.ఒక గర్భిణి ప్రాణం కంటే రోడ్డుపై పెట్టిన దుకాణ సామగ్రి ముఖ్యమాఅంబులెన్స్ సైరన్ వినిపించినా దారి ఇవ్వని పరిస్థితికి బాధ్యులు ఎవరు?ప్రాణనష్టం జరిగే వరకు అధికారులు చూస్తూ ఉంటారా ఇకనైనా అధికారులు మాటలతో కాదు.. ఆక్రమణలు తొలగించి చర్యలతో సమాధానం చెప్పాలని నగర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీటు పొందిన పేదింటి కుసుమం అబూబకర్ సిద్ధిఖ్

**నకిరేకల్: సెప్టెంబర్ 15 విజయ కెరటం ప్రతినిధి**



పేద కుటుంబానికి చెందిన విద్యార్థి అబూబకర్ సిద్ధిఖ్ తన ప్రతిభతో అరుదైన ఘనత సాధించాడు. చీజుజు ప్రవేశ పరీక్షలో 552 మార్కులు సాధించి ప్రతిష్ఠాత్మక ఉస్మానియా మెడికల్ కాలేజీలో వైద్య విద్యకు సీటు సాధించాడు.నకిరేకల్‌కు చెందిన మౌలానా అక్బర్ కుమారుడు అబూబకర్ సిద్ధిఖ్, చౌటుప్పల్ మైనారిటీ గురుకులంలో విద్యాభ్యాసం పూర్తి చేసి వికారాబాద్ ఎ×జు లో ఫ్రీ సీటు పొంది, ఆర్థికంగా ఎంతో వెనుకబడిన కుటుంబం నుంచి వచ్చినప్పటికీ, చదువుపై ఉన్న ఆసక్తి, పట్టుదలతో కష్టపడి చదివి చీజుజులో 552 మార్కులు సాధించాడు. అబూబకర్ తండ్రి కౌసర్ మసీదు, రహమత్ నగర్, నకిరేకల్‌లో మౌలానాగా సేవలందించారు. గత సంవత్సరం తండ్రి స్వర్గస్తులైన కూడా అధైర్య పడకుండా గట్టి పట్టుదలతో మొక్కవోని ఆత్మ విశ్వాసంతో, మెడికల్ సీటు సాధించాడు. తల్లిదండ్రులు పరిమిత ఆర్థిక వనరుల మధ్య కూడా కుమారుడి చదువుకు ప్రోత్సాహం అందించారు. గురుకులంలో అందిన విద్యా సహకారాన్ని సద్వినియోగం చేసుకున్న అబూబకర్, తన లక్ష్యాన్ని చేరుకుని ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీటు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, మిత్రులు, నకిరేకల్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.పేదరికం తన లక్ష్యానికి అడ్డంకి కాదని నిరూపించిన అబూబకర్ సిద్ధిఖ్ విజయం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. అబూబకర్ భవిష్యత్తులో మంచి వైద్యుడిగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని పలువురు ఆకాంక్షించారు.

## భూసేకరణ బిల్లులు త్వరగా చెల్లించాలి కలెక్టర్

**నలగొండ సెప్టెంబర్ 15 విజయ కెరటం ప్రతినిధి**

భూసేకరణ చెల్లింపులలో భాగంగా జిల్లాలో ఆయా ప్రాజెక్టుల కింద భూసేకరణ చెల్లింపులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. భూసేకరణ పై ప్రతి వారం నిర్వహించే సమీక్షలో భాగంగా మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ, నీటిపారుదల ఇంజనీరింగ్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు.డిండి,చింతపల్లి, పెండ్లిపాకల, శివన్న గూడెం, తదితర రిజర్వాయర్ల కింద భూములు కోల్పోయిన రైతులకు చెల్లింపులు చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినందున ఆయా ప్రాజెక్టుల వారిగా పెండింగ్ లో ఉన్న భూసేకరణ చెల్లింపులన్నింటిని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో రెవెన్యూ, ప్రాజక్టుల ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి చెల్లింపులు వేగవంతం చేయాలన్నారు. అవసరమైనచోట జిల్లాస్థాయి సంప్రదింపుల సమావేశాన్ని నిర్వహించాలని, ఎట్టి పరిస్థితులలో తప్పుగా చెల్లింపులు చేయవద్దని, ఇంజనీరింగ్ అధికారులు , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆయా ప్రాజెక్టులు రిజర్వాయర్ల కింద సేకరించిన భూములకు సంబంధించి అవార్డు, అలైన్మెంట్ ,మ్యాపు, జియో కోఆర్డినేటర్ తో సహా ఫైలు నిర్వహించాలని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి, డిఆర్ఓ దశరథ, ఆయా ప్రాజెక్టుల ఇంజనీరింగ్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు హాజరయ్యారు.

## డిండి ప్రాజెక్టు కింద సాగు చేసిన పంటలను కాపాడాలి

**నల్లగొండ సెప్టెంబర్ 15 విజయకేరటం ప్రతినిధి**

డిండి ప్రాజెక్టు ఆయకట్టు కింద సేద్యం చేసిన పంటలను కాపాడాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో ఉన్న డిండి ప్రాజెక్టు కింద సుమారు 25వేల ఎకరాలు సేద్యం చేశారు. ఇందులో ఎక్కువ భాగం వరిపంట వేశారు. ఈ వరిపంట పొట్టదశలో ఉండటంతో ఎక్కువ నీరు కావాల్సి ఉన్నది. డిండి ప్రాజెక్టులో నీరు అడుగంటడంతో ప్రాజెక్టు నుండి సాగుచేసిన పంటలకు నీరు ఇవ్వకపోవడంతో ఎండిపోయే దశకు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా సాగునీటి పారుదల, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు వెంటనే సర్వే చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నీటి విడుదల గురించి నివేదించాలని కోరారు. ఈ రైతులను ఆదుకోవడానికి యుద్ధప్రాతిపదికన కల్వకుర్తి ఎత్తిపోతల నుండి డిండి ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కూడా డిండి ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసి పంటలను కాపాడారని గుర్తు చేశారు. నీటిని విడుదల చేయకపోతే ఈ ప్రాంత రైతాంగాన్ని సమీకరించి ఉద్యమం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

